కలువకొలను సదానంద

ఆనాడు జనమేజయ మహారాజు సర్పయాగం తలపెట్టాడన్న వార్త విని, ప్రాణాలమీద తీపిచేత దేవేంద్ర సింహాసనానికి చుట్టుకుపోయాడు తక్షకుడు !... నరహరిపేటలో పెద దానవయం, చినదానవయ్య అనే మిత్రద్వయం ఈనాడు శునకయాగం తలపెట్టగా - శరణుజొచ్చే దిక్కులేక, అతి జాగరూకతతో నడయాడసాగింది ఫకీరు కుక్క.

నరహరిపేట ఒక చిన్న గ్రామం. ఆ గ్రామంలో అన్ని కులాలవారు,

అన్ని వృత్తులవారూ ఉన్నారు. రైతులది కొంచెం పెద్ద సంఖ్య. అన్నీ మట్టి మిద్దెలు, పూరిండ్లు, పెంకుటిళ్ళే తప్ప మరొకవిధమైన కట్టడమే కానరాదు. విద్యుచ్ఛక్తి సరఫరా లేదు. ఇంతవరకు నరహరిపేటకు రైలు టిక్కెట్టు కొన్న మనిషి ఇహలోకంలోగానీ, పరలోకంలో గానీ లేడు. గుట్టల నడుమ మలుపులు తిరుగుతూ, ఎర్రటి దుమ్ముతో సింగారించబడిన సన్నటి కంకరబాట ఒకటి ఆ ఊరికి సాగిపోతుంది! ఊరికి తూర్పుగా చిన్న చెరువు, చెరువుక్రింద కొంతమేర పచ్చని పైరులు, మిగిలిన మూడుదిక్కులా చిన్న చిన్న గుట్టలు, అక్కడక్కడ కానవచ్చే మెట్టచేలు - ఇదే ఆ ఊరి ప్రకృతి. మనిషి అరణ్య మధ్యంలో ఉన్నా - నీతి, న్యాయం పరిపాలింపబడాలి కాబట్టి, ఆ ఊళ్లో చిన్న పోలీసుస్టేషను ఉన్నది.

రెండేండ్లుగా వానలు పడనికారణంగా నరహరిపేటలో వ్యవసాయం మంద గించింది. గాదెలూ గరిసెలూ అన్నీ ఖాళీ అయిపోయాయి. రైతుల పాలిట గడ్డురోజులు తారసిల్లాయి. విజ్ఞానము, విచక్షణ ఉన్న మానవుడే కడుపు కోసం ఘాతుకాలకు ఒడిగట్టుతున్నప్పుడు పాపం, నోరులేని కుక్కలు చట్టిలో ముట్టె దూర్చకుండా ఎలా ఉండగలవు?

పెదదానవయ్య, చినదానవయ్య కూడా కాటకానికి గురైన గృహస్థులే! వారివి ఒడిదుడుకులు లేక సాఫీగా సాగి పోయే సంసారాలే అయినా, చేతి కంది నంతవరకూ అప్పుచేసి, శెట్టిగారి కొట్లో సన్ననూకలు, పుచ్చిన జొన్నలు కొని తినక తప్పలేదు. ఆ కబళాన్ని కూడా వంటింట్లోనుంచి ఊరకుక్కలు కాజేసిన సంఘటనలు రెండు మూడు జరగడంతో ఆ ఇద్దరూ ఉగ్ర నరసింహమూర్తు లైపోయారు. కంటబడిన కుక్కనల్లా అక్కడికక్కడే కడతేర్చివేయడానికి కంకణం కట్టుకొన్నారు.

ఈ విషయంలో పెదదానవయ్యకు చినదానవయ్య పోటీమాత్రం ఉధృతంగా సాగింది. ఒకడి స్థాయిని అతిక్రమించ డానికి మరొకడు ఉరకలు వేశాడు. "నే నీ రోజు రెండు కుక్కల్ని చంపాను..." అని పెదదానవయ్య కనుబొమ లెగరేస్తే "నేను మూడింటిని మట్టుబెట్టేశానులే!" అంటూ మీసం దువ్వేవాడు చిన దానవయ్య. చినదానవయ్య మూడు కుక్కలకు ముక్తిని ప్రసాదిస్తే, వాటి వెనుక నాలుగింటినైనా సాగనంపడం తనకు కీర్తికారకం అనుకునేవాడు పెదదానవయ్య.

ఈ హత్యాకాండ ఇలా కొనసాగి పోతుండగా, కుక్కలపట్ల వారికి గల ద్వేషం కూడా ఆకాశానికి గోడ కట్టినట్లు పెరిగిపోసాగింది.

పెదదానవయ్య ఇంట్లో ఉండగానే సంగటిచట్టి నాకిపోయింది ఒక కుక్క.



ఒక రాత్రిపూట చినదానవయ్య తన యింటి అరుగుమీద చలికి వెచ్చగా దుప్పటి కప్పుకొని నిద్రపోతుంటే, అతని ప్రక్కనే దుప్పటి ముసుగులో దూరి హాయిగా పడుకొంది ఇంకొక కుక్క.

పెదదానవయ్య భోజనం చేస్తూఉంటే – దగ్గరకు దగ్గరకు వస్తూ కంచంలో అన్నాన్ని తదేకంగా చూస్తూ, అతనికి దిష్టి పెట్టింది మరొకటి.

చినదానవయ్య ఇంటి గడపలో కూర్చుని చుట్ట కాల్చుకుంటూఉంటే – అతడున్నాడన్న భయభక్తులు లేకుండా ఇంటి లోపలికి లంఘింపజూసింది వేరొకటి !

కుక్కలంపైన వారి ద్వేషం మహోన్నతమైపోవడానికి ఇవన్నీ కూడా కారణాలు.

నరహరిపేటలోని కుక్కలకు వినాశకాలమే దాపురించింది. దానవయ్యల చేతులనుంచి విసరబడిన ఆయుధం ఎట్టిదైనా సరే – అది రామబాణమే ! కడవలోని కవ్వం మజ్జిగను, వెన్నను వేరుచేసినట్టు – అది కుక్క ప్రాణాన్నీ శరీరాన్నీ వేరుచేసేది. రాను రాను వారిద్దరి దర్శనం సింహదర్శనమైపోయింది కుక్కలకు. పెదదానవయ్యో, చినదానవయ్యో కనుచూపుమేరలో కనిపిస్తేచాలు–అయ్యవారిని చూచిన బడి దొంగల్లా అడ్డదారుల్లో పడి పరుగులెత్తేవి. ఈ ఉద్యమంలో యుక్తులూ, ఎత్తుగడలూ కూడా అవలంబించారు వారు. రాను రాను ఇది వారికొక వినోద క్రీడగా కూడా పరిణమించింది.

ఊరిలోని కుక్కల సంఖ్య చాలవరకు తగ్గిపోయింది. ఇక కొద్ది కుక్కలతో బాటు, ఫకీరు కుక్క కూడ మిగిలిపోయింది. దాన్ని దాని అన్నల జాబితాలో చేర్చడానికి ఎన్నో ఎత్తుగడలు పన్నారు దానవయ్యలు! కాని, దాని ఆయుస్సు గట్టిది. వారి ఎత్తుగడలన్నీ, ఛేదించుకుంటూ వారితో దాగుడుమూతలాడటం పరిపాటి అయిపోయింది దానికి. వారిచేత నిహతమై స్వర్గాన ఉన్న

కుక్కల్లాగా - ఫకీరుకుక్క తెలివి లేనిది కాదు. అది అనుక్షణం తన స్మృతిని తన ప్రాణం చుట్టూ కవచంలా పరచుకొంది. మలుపులో యముడు పొంచికున్నాడని అది ముందుగానే పసి గట్టేసేది. అయినా - ఈ జాగరూకతే దానికి అశాంతికరంగా పరిణమించింది. చచ్చిన కుక్కలన్నీ ఏ దిగులూ భయమూ లేక హాయిగానే చచ్చి పోయాయి. దినగండం నూరేండ్లా యుస్సుగా జీవిస్తున్న ఫకీరుకుక్కకు కొండంత దిగులు గుండెలో గూడు కట్టుకొంది. ఏ దుర్ముహూర్తంలోనో ఏ కర్రో, రాయో వచ్చి తన బుర్రను రామకీర్తన పాడించగలదు. ఏ మలుపు లోనో మృత్యువు తనను తటాలున కౌగిలించుకోగలదు......ఈ విధమైన వ్యధతోనేమో - చిక్కి శల్యమైంది ఫకీరు కుక్క. దీని విషయంలో మాత్రం ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు దానవయ్యలు. దానిమీద ఇంతటి గట్టి పగబూనడానికి మరొక ప్రబలకారణం కూడా లేకపోలేదు.

* * *

నరహరిపేటలో - ఇల్లూ వాకిలీ, తోడూ నీడా లేని ఒక మూగవాడుండే వాడు. అతగాడి రూపురేఖలను వర్ణిస్తూ కూర్చుంటే - మనోనేత్రం ముందు ఒక వికృత రూపం పొడగట్టగలదు. బహుశా వానరుడు నరుడుగా మారే పరిణామ కాలంలో అటువంటి ఆకారం ఉండి ఉంటుంది. ఆ మూగవాడి పేరు ఫకీరు.

ఫకీరుకు నా అన్నవారెవరూ లేరు. ఉదరపోషణకు ఉపకరించగల యోగ్యత లేవీ లేవు. ఆదిమానవుడికున్న యోగ్యతే అతనికి ఉంది అది శరీర బలం. అయితే అతడు ఆదిమానవుడికి మల్లే ఏ ప్రాణినీ హింసించలేదు. తన కాయకష్టాన్ని వెలకు అమ్ముకోవడమే వృత్తిగా పెట్టుకొన్నాడు. ఎవరు ఏ పని చెప్పినా నోరు మెదపకుండా చేసి పెట్టేవాడు. కూలికి సరుకులు మోసే వాడు. ఎప్పుడైనా ఆ ఊరికి లారీ వచ్చినప్పుడు, అందులోంచి మూటలు ఎత్తివేసేవాడు. కల్లో, గంజో పోస్తే త్రాగేవాడు. ఒకటో, అరో కాసులిస్తే జేబులో వేసుకునేవాడు. సూర్యుడు గూటిలో పడగానే ఎక్కడో ఒకచోట మేను వాల్చటం, సూర్యుడితోపాటు లేచి వీధుల్లోకి వెళ్ళటం - అతని నిత్య కృత్యాలు. ఎప్పుడూ అతన్ని నీడలా వెన్నంటి తిరుగుతూ ఉంటుంది ఒక నల్లకుక్క.

ఒకనాడు పెదదానవయ్య చెవిలో ఏదో ఊదాడు చినదానవయ్య. పెద దానవయ్య కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వైనాయి. "నేను నమ్మలేను. అయినా, ఇది నిజమా, ఒట్టి అనుమానమేనా?..."

"అనుమానమే అనుకో! అయినా

నిజం మాత్రం కాకపోదు" అన్నాడు చినదానవయ్య.

ఆనాటినుంచీ వారిద్దరూ ఫకీరు దుస్తులమీద ఒక కన్నువేసి వుంచారు.

ఫకీరు బట్టలు దళసరిగా, అపరిశుభ్రంగా వుండి, దుర్వాసన వెదజల్లుతూ ఉంటాయి. అతడికున్నవి ఆ ఒక్క జత బట్టలే! వాటిని అతడెప్పుడూ ఉతుక్కోనైనా ఉతుక్కోడు. ఆ దుస్తులు అతడి బహిశ్చర్మం!

ఒకనాటి రాత్రి ఊరిబయటి పోలేరమ్మ గుడివరకు ఫకీరును రహస్యంగా అనుసరించారు దానవయ్యలు. మంచివాని మనస్సులా తెల్లగా తేటగా ఉంది వెన్నెల. ఫకీరు గుడివెనుకకు వెళ్ళాడు. తన లాగు విప్పి తిరగేశాడు. కొన్ని కరెన్సీ నోట్లు దానిమీద ఉంచి ఒక గుడ్డముక్క పెట్టి చుట్టూ కుట్టేశాడు. మళ్ళీ లాగూ తొడుక్కున్నాడు.

దురాశతో తబ్బిబ్బయిపోతూ చినదానవయ్య భుజంమీద చెయ్యి వేశాడు పెదదానవయ్య. ఇంతలో ఫకీరు కాళ్ళ దగ్గరే కూర్చుని ఉన్న కుక్క బిగ్గరగా భౌరిళ్ళున మొరిగింది. దానవయ్యలు ఏమీ ఎరుగనివాళ్ళకు మల్లే చాటు మాటుగా వెళ్ళిపోయారు.

ఫకీరు దుస్తుల్లో దాగిఉన్న మర్మం విదితమైపోయింది వాళ్ళకు. ఫకీరు కొన్ని సంవత్సరాలుగా నరహరిపేటలో ఉన్నాడు. తాను తినగా మిగిలిన సంపాదనంతా నిత్యమూ తన రక్షణలోను, తనకు అందుబాటులోను ఉన్నటువంటి ఒక ఖజానాలో దాచుకొంటున్నాడు. అతని ఒక్కగా నొక్క జత బట్టలే అతని ఖజానా! ఈ రహస్యం దానవయ్యలిద్దరే కనిపెట్టగలిగారు.

ఆ ఖజానాను దోచుకోవాలన్న సంకల్పంతో ఇద్దరూ మార్గాలు వెతుకసాగారు. ఇనప్పెట్టెలోని డబ్బులైనా కాజేయవచ్చుగానీ. ఫకీరు వద్ద నున్న డబ్బును కాజేయడం తేలికయిన పనిగాదు.

అతని ధనాన్ని అపహరించడమే ధ్యేయంగా ఉన్న ఆ మిత్రులకు ఒకనాడు మంచి అవకాశమే దొరికింది. ఆనాటి మిట్ట మధ్యాహ్నం - ఊరిబయట మునసబ్‌గారి కపిలబావి గట్టున ఎండిపోయిన వేపచెట్టును గొడ్డలితో నరుకుతూ కనిపించాడు ఫకీరు. వేలికి ఉన్న బంగారు ఉంగరం నాణ్యాన్ని తడివి చూచుకుంటూ, అతని దరగ్గకు వెళ్ళి, నిలబడ్డాడు పెదదానవయ్య. "ఫకీరూ! ఎలాఉంది ఉంగరం? మొన్నే చేయించాను. బాగుందా..." అన్నాడు.

ఫకీరు చెట్టు నరకడం ఆపి, ఉంగరం కేసి పెద్ద కళ్ళతో చూచి నవ్వుతూ "భలే బాగుంది" అన్నట్లు "బే-బే-బే" అన్నాడు.

"దీని మదింపు ఎంత?" అని

అడిగాడు, మూగ భాషలోనే. ఆశ్చర్యంతో ఆ ఉంగరాన్ని తీసి తన చేతివేలికి పెట్టుకొని కొంతసేపు ఆనందంతో తన్మయుడై, దాన్ని దానవయ్యకు తిరిగి యిచ్చేశాడు.

"ఉండు ఫకీరూ! దాహమేస్తోంది. బావిలో దిగి నీళ్ళు తాగి వస్తా" అని, దానవయ్య బావివైపు నడిచాడు. ఫకీరు మళ్ళీ తన పనిలో నిమగ్నుడైపోయాడు.

బావిలోకి దిగుతూ దిగుతూ, పెదదానవయ్య ఉంగరాన్ని తీసి, పంచె కొంగున ముడివేసుకున్నాడు.

రెండునిమిషాల తరువాత "ఫకీరూ! ఫకీరూ!" అని బిగ్గరగా ఒక కేక వినవచ్చింది, బావి వైపునుంచి. ఫకీరు గొడ్డలి నేలమీద పడేసి బావిదగ్గరికి వెళ్ళాడు. పెదదానవయ్య గోచీ పెట్టుకుని నీళ్ళల్లో కలియ దిరుగుతున్నాడు.

"ఏమే...?" అన్నాడు ఫకీరు, ఏం జరిగిందన్నట్లు.

"ఉంగరం జారి పడిపోయింది."

ఫకీరు తన అభినయంతో ఆశ్చర్యము, సానుభూతి, విచారమూ అన్నీ మూక ఉమ్మడిగా ప్రదర్శించేశాడు.

పెదదానవయ్య ఏడెనిమిదిసార్లు బావి లోకి మునకలు వేశాడు. ఒడ్డుకువచ్చి పెదవి విరిచాడు. "అయ్యో, కష్టపడి సంపాయించిన సొమ్ము – నీళ్ళపాలై పోయింది..." అంటూ విచారంగా కూర్చున్నాడు. "ఫకీరూ అడుగున అంతా గాలించేశాను. కనిపించనేలేదు. నువ్వు ఒకసారి దిగి చూడరాదూ!..."

ఫకీరు అనంగీకార సూచకంగా తల అడ్డంగా ఆడించాడు. "నావల్లగాదు బాబూ!... ఏమీ అనుకోకు!" అని సంజ్ఞల ద్వారానే తెలియజేశాడు.

కొంతసేపటి తర్వాత పెదదానవయ్య బట్టలువేసుకొని "సరే! నే వెళ్తాను. ఏం జేయాలి? ఆ సొమ్ము నాది గాదంతే!" అంటూ విచారంగా అక్కణ్ణించి సాగిపోయాడు.

అతను కనుమరుగయ్యేంతవరకు అలా చూస్తూనే నిలబడిపోయాడు ఫకీరు. తరువాత నెమ్మదిగా వెళ్ళి గొడ్డలి చేతి కందుకుని, చెట్టునరకడం మొదలు పెట్టాడు.

దురాశ దుఃఖానికి నెలవు అన్నది జగమెరిగిన సూక్తి. ఈ సూక్తి తెలిసి వున్నవారిని కూడా దురాశకు గురిచేసే చెడ్డవేళలు అనూహ్యంగానే తారసిల్లుతూ ఉంటాయి. బుర్రనిండా ఏవేవో ఆలోచనలు సందడిచేయగా, ఫకీరు గొడ్డలి క్రిందపడేసి, ఒక రాతిమీద కూర్చున్నాడు. కొంతసేపు గడిచింది. ఫకీరు చుట్టూ చూశాడు. దగ్గరలో మనుషులెవరూ లేరు. ఫకీరు పైకి లేచాడు. చెట్టునీడలో పడుకొనిఉన్న కుక్కకూడా పైకిలేచి ఒళ్ళు దులుపు కుంది. బావిగట్టుకు నడిచాడు ఫకీరు. కుక్క అతన్ని అనుసరించింది. ఫకీరు




బట్టలు విప్పి, గుబురుగా ఉన్న ఒక పొదలో దాచిపెట్టాడు. కుక్కను అక్కడ కూర్చోబెట్టాడు. తాను బావిలోకి దిగి, బుడుంగున నీళ్ళలో మునిగాడు.

చెట్ల చాటునుంచి చినదానవయ్య ఇవతలికి వచ్చాడు. "ఇజ్జూ...యిజ్జూ" అంటూ కుక్కను మెల్లగా పిలిచాడు. కుక్క తలెత్తి అతనివైపు చూచింది. అతని చేతిలో మాంసపు ముక్క! కుక్క ఆశగా తోకాడిస్తూ, అతనివైపు నడిచింది. చేతిలో మాంసాన్ని ఎరగా చూపిస్తూ, దాన్ని అలాగే దూరంగా తీసుకెళ్ళాడు చినదానవయ్య.

లోపలికి, ఉపరితలానికి మునకలు వేస్తూనే ఉన్నాడు ఫకీరు. పొదలచాటు నుంచి పెద దానవయ్య రావడం, అతని బట్టల్ని చుట్టచుట్టి చేతబట్టుకుని చల్లగా జారుకోవడం అతడు గమనించలేదు.

వెతికి వెతికి విసిగిపోయి, ఒడ్డుకు వచ్చిన ఫకీరుకు తన బట్టలు కనిపించక పోగా, గుండె బ్రద్దలైనంత పని జరిగింది. చెట్లు, పుట్టలు, పొదలు అన్నీ గాలించేడు. కోపంకొద్దీ కుక్కను డొక్కలో తన్నాడు. గట్టిగా ఏడుస్తూ గుండెలు బాదుకొన్నాడు. పిచ్చివాడిలా బావిచుట్టూ పరుగెత్తాడు. వాడి ఏడుపులు ఎవరికి అర్థమవుతాయి ? తన చింపిరి బట్టలకోసమా రోదిస్తున్నాడు ఫకీరు? పాపం ... యిది విన్నవారు విరగబడి నవ్వుకొన్నారు.

దానవయ్యలు రహస్యంగా ఫకీరు బట్టలకున్న అతుకులన్నీ ఊడబెరికారు. మాసిపోయి, నలిగిపోయి, బట్టకంటుకున్న నోట్లనన్నిటినీ లెక్కబెట్టారు. సుమారు సంఖ్యలో చెప్పాలంటే, ఆ మొత్తం మూడువేలు! ఫకీరు దశాబ్దం పైగా తన చెమటోడ్చి సంపాదించి దాచుకున్న కష్టార్జితం!

* * *

దానవయ్యలిద్దరూ కలిసి ఉమ్మడిగా

కపిలబావి ఒకటి త్రవ్వుకోబోతున్నా రన్న వార్త నరహరిపేటలో కొందరికి అసూయను, మరి కొందరికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

చెరువుదగ్గర - వారిద్దరి పొలాలూ పక్క పక్కనే ఉన్నాయి. చెరువు ఎండి పోయినప్పుడు ఆ పొలాలకు నీటివసతి శూన్యం. అందుచేత తమ యిద్దరి పొలాలకు సరిహద్దున బావి ఒకటి త్రవ్వించదలుచుకున్నారు వారు.

పని ప్రారంభమైంది. బావి నాలుగు మట్లులోతు తెగింది. అనుకోకుండా బావి లోను, ఆ యిద్దరి గుండెల్లోను బండ పడింది. బస్తీనుంచి నల్లమందు తెప్పించి నాట్లు పెట్టించారు. బండ పగిలింది. రాతి పలుకులు ఆకాశాని కెగిరాయి. బావి చుట్టూరా, గట్టున గుట్ట తయారైంది. అయినా బావిలో బండకు అంతులేదు. ఒక పొట్టేలు, ఒక దున్నపోతు తలలు కూడా తెగాయి. ప్రయోజనం మాత్రం లేకపోయింది. నీళ్ళు పడలేదు. మూడు వేలూ కరిగిపోగా-దానవయ్యలు ఖిన్నులై పోయి, అంతటితో ఆ ప్రయత్నం ఆపి వేశారు.

రోజులు గడిచిపోసాగాయి. బావి అసంపూర్ణంగానే ఉండిపోయింది. దట్టంగా ముళ్ళపొదలు, తీగలూ చుట్టూ మొలిచిపోయాయి. ఇనుము కరిగించి ఆ బావిలో పోతపోసి తీస్తే, రకరకాల భయంకరాయుధాలు తయారు కాగలవు. బావి - మొనదేలిన రాళ్ళతో నిండి, గట్టున నిలబడి చూసేవారికి గుండెలవియజేసేది.

ఒకనాడు దానవయ్యలు బావిగట్టున కలుసుకున్నారు. "ఇదిగో తమ్ముడూ! నా కొక ఆలోచన తోస్తోంది!...పెద్దల కాలంలో నరబలులుకూడా యిచ్చే వారటగా?" అన్నాడు పెద్దదానవయ్య.

"అమ్మబాబోయ్! నరబలే?" అంటూ బావిగట్టునుంచి వెనక్కు నాలు గడుగులు వేశాడు చినదానవయ్య.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు చినదానవయ్యకు. నరబలిని గూర్చిన ఆలోచనతోనే, గడిపి. తెల్లవారుజామున ఎప్పుడో చిన్న కునుకు తీశాడు. ఉదయం లేచీలేవగానే పెదదానవయ్య దగ్గరికి పరుగెత్తుకువెళ్ళాడు.

"అన్నయ్యా! రాత్రి కల్లో గంగా భవాని కనిపించింది..." అన్నాడు వగర్చుతూ. "ఒరేయ్ చినదానవయ్యా! నేను గంగాదేవిన్రోయ్! పొట్టేలు నెత్తురు నా కెందుకురోయ్! దున్నపోతు నెత్తురు నా కొద్దురోయ్! నాకు నరబలి యివ్వం డ్రోయ్!...మీరు చల్లగుంటారు...'అని చెప్పిపోయిందిరా అన్నయ్యా!"

"ఏమిచేమిటీ? గంగాభవాని చెప్పిందా అలాగని?" అన్నాడు పెద దానవయ్య విస్మయంతో.

దేవికి నరబలి యివ్వడానికే నిశ్చ యించుకున్నారు ఇద్దరూ. ఒక సమస్య

తీరిందనుకుంటే, మరొక సమస్య తలెత్తింది.

నరబలి

నల్లిని, చీమను, దోమను నలిపివేస్తే చట్టం ఊరుకుంటుందిగానీ, మనిషిని నలిపివేస్తే చట్టం ఊరుకుంటుందా?

మనిషిని చంపే విషయంలో ఇద్దరి గుండెలూ కాస్త వెనకడుగు వేశాయి. ఈ అధైర్యం కారణంగానే మరికొన్ని రోజులు గడిచిపోయాయి.

వారి దృష్టి అకస్మాత్తుగా ఫకీరుపైకి ప్రసరించింది. ఫకీరు దాదాపు పిచ్చివాడే అయిపోయాడు. తన ప్రాణంతో ప్రాణంగా ఉన్న ధనం పరులపాలై పోగానే, అతని హృదయం తీవ్రాఘాతానికి గురైంది. అతడిప్పుడు ఏ పనీ చేయడంలేదు. ఎవరితోనూ మనసిచ్చి మెలగడంలేదు. మనుషులకు దూరంగా, ఏకాంతంగా, నిశ్శబ్దంగా కూర్చుంటాడు. అప్పుడప్పుడూ మునసబుగారి బావిగట్టున పొదలలో చేజారిపోయిన తన నిధిని వెదకుతూ కనిపిస్తాడు. అతని నల్ల కుక్క అతనికెప్పుడూ తోడు.

ఫకీరు దిక్కులేనివాడు. వాడు కని పించకపోతే వాణ్ణిగూర్చి ఆలోచించే నాధుడేలేడు. తమకు అందుబాటులో ఉన్నవాడు, ఆపదలు తెచ్చిపెట్టనివాడు ఫకీరొక్కడే!

ఒక అమావాస్యనాటి అర్ధరాత్రి చావడి అరుగుమీద ఒంటరిగా పడుకొని నిద్రపోతున్న ఫకీరును తట్టి లేపారు దానవయ్యలు. తమవెంట రమ్మని పిలిచారు. "ఫకీరూ! వెళ్దాం రా!"

ఫకీరు కదల్లేదు.

"ఫకీరూ! మా వెంట రా!"

ఫకీరు నవ్వుతూ అలాగే కూర్చున్నాడు.

"నీ బట్టలు నీకు వద్దూ? మాతో వస్తే చూపిస్తాం!" అంటూ సంజ్ఞల ద్వారా చెప్పారు అంతే! ఫకీరు చివాలున పైకి లేచాడు. వారిని అనుసరించాడు అరుగుమీద పడుకున్న కుక్క చెంగున క్రిందికి దూకింది. దానవయ్యలు దాన్ని అదిలించారు. అది ఆగిపోయింది.

ఫకీరును వెంటబెట్టుకుని ఎవరికీ తెలియకుండా తమ పొలాలవైపు నడిచారు. కొంత దూరం వెళ్ళాక కుక్క మళ్ళీ ప్రత్యక్షమైంది. రాళ్ళు రువ్వి దాన్ని మళ్ళీ వెనక్కు తరిమివేశారు. ముగ్గురూ రాళ్ళబావి దగ్గరికి చేరుకొన్నారు.

పెదదానవయ్య హఠాత్తుగా ఫకీరు నోరునొక్కి పట్టేశాడు. చినదానవయ్య చేతిలో కత్తి తళుక్కున మెరిసింది. ఫకీరు గుండె ఝల్లుమంది. శక్తినంతా ఉపయోగించి పట్టు వదిలించుకొని, బిగ్గరగా ఆర్తనాదం చేస్తూ పది అంగల దూరం ముందుకు పరుగెత్తి బోరగిల పడిపోయాడు. కటిక గుండెతో పెద

దానవయ్య అతనిమీదికి లంఘించాడు. ఇంతలో ఫకీరు కుక్క 'భౌభౌ' అంటూ ప్రత్యక్షమైంది. అది అటూ యిటూ చకచకా తిరుగుతూ మోర పైకెత్తి బిగ్గరగా మొరగసాగింది. ఆ పరిసరాలంతా దాని అరుపులతో, ఫకీరు కేకలతో మారుమ్రోగిపోయింది. కరడుగట్టుకొన్న ఆ ఇద్దరి మొండి ధైర్యమంతా చల్లగా నీరుగారిపోయింది. నిలువెల్లా భయం ఆవహించగా, కాళ్ళు చేతులు తడబడుతుండగా, ఫకీరును విడిచిపెట్టి తలొక దిక్కుగా పారిపోయారు, ఇద్దరూ. పోతూ పోతూ విచ్చికోపంతో తన చేతిలోని కత్తిని కుక్క మీదికి గిరవాటువేశాడు చినదానవయ్య.

తెల్లవారింది. నరహరిపేటలో ఫకీరు కనిపించలేదు. డబ్బు పోతే పోయింది; ఊపిరుంటే ఆటువంటి డబ్బు ఎంతయినా కళ్ళజూడవచ్చు ననుకున్నాడో ఏమో! కత్తి తగిలి, ఫకీరు కుక్క మాత్రం కుంటిదై మిగిలిపోయింది ఆ ఊళ్ళో.

* * *

ఈ నవనాగరిక యుగంలో-ఎవడు మానవుడు, ఎవడు దానవుడు అని రూఢ నిర్ణయం చేసి చెప్పడం అసంభవం. ఆ యా జాతిని నిర్ణయించగలది వ్యక్తి స్వభావమే!

లోకోపద్రవకరంగా ప్రవర్తించటమే రాక్షస ప్రవృత్తి అనబడుతుంది. తదుపద్రవాన్ని అడ్డుకొని, శిష్టులైన వారిని రక్షించడానికి భగవంతుడు తరచుగా అవతరిస్తుంటాడని పురాణాలు, మత గ్రంథాలూ చెబుతాయి. ఈ ప్రయోజనం కొరకు అవతరించినవారే నరహరి, శ్రీరామచంద్రుడు మొదలైనవారు. అయితే, హిరణ్యకశిపుడు, రావణాసురుడు మున్నగువారు భగవానునిమీద వైరం పూనితే, దానవయ్యలు-కడుపు నిండితే అదే కైలాసమనుకునే అల్ప జాతి ప్రాణిపట్ల పగబూనారు. వెనుకటి దానవుల చరిత్రలో ఎక్కడా కానరాని విచిత్రోదంతం ఇది. అయితే ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూశారు? ఆనాడు అజాండాన్నే మున్నీట ముంచివేయ నుద్యమించిన హిరణ్యాక్షుడ్ని తుద ముట్టించలేదా వరాహం? అందుకే కాబోలు భగవంతుణ్ణి 'నీ లీల పొగడ తరమా' అని స్తుతించారు భక్తాగ్రేసరులు! ఈ కుక్క వలన కాగల కార్యం ఏమున్నదో?...

"ఈనాటితో ఫకీరుకుక్క సంగతేమిటో తేల్చేయాలి!" అనుకున్నారు దానవయ్యలు. తలా నాలుగు ముంతల కల్లు త్రాగారు తలొక రోకలిబండ చేత బుచ్చుకున్నారు ఫకీరు కుక్కను వెంబడించారు. కుక్క కుంటి పరుగుతోనే ఈ వీధినుంచి ఆ వీధికి, ఆవీధి నుంచి మరొక వీధికీ పరుగులు తీసింది. సందుగొందులంతా కదం తొక్కేసింది. దానవయ్యలు మాత్రం దాన్ని విడిచి

పెట్టదలుచుకోలేదు. చెరొక వైపునుంచి దానిమీదికి దాడి ప్రారంభించారు. మృత్యువు ఈనాడు కృతనిశ్చయంతో తన వెంటబడుతూ ఉన్నదని గ్రహించింది, కుక్క. అది ఊరిబయటికి పరుగు తీసింది. ఆయాసం తీర్చుకోడానికి ఒక్కసారి నిలబడి వెనక్కు తిరిగి చూచింది. యమభటులు తరుముకొస్తూనే ఉన్నారు. కుక్క మళ్ళీ ముందుకు ఉరకలు పెట్టింది. వారికి కనిపించకుండా ఒక ముళ్ళ పొద చాటున దాక్కుంది. దానవయ్యలు పొదను గాలించడం మొదలుపెట్టారు. రోకలి రివ్వున వచ్చి కుక్క ప్రక్కన పడింది. కుక్క చెంగున దూకి ద్విగుణీకృత వేగంతో పరుగెత్తింది. ఊరి చుట్టూ నాలుగుసార్లు ప్రదక్షిణం చేసింది. ఒకసారి సూటిగా, మరొకసారి అడ్డదిడ్డంగా, ఇంకొకసారి వంకరటింకరగా, గమ్యంలేకుండా పరుగెత్తింది. ఎంతసేపు అలా పరుగెత్తగలదు? నీడలా చావు వెన్నంటి వస్తూవుంటే, ఎక్కడికి పోగలదు?...పాపం, దాని కళ్ళనుంచి కన్నీళ్ళు జారడం మొదలు

పెట్టింది. ఇక చేయగలిగేదేమీ లేక, ఎలాగో వారి కన్నుగప్పి ఒక పొదలో ముడుచుకు కూర్చుంది.

పొద్దు వాలింది. చీకట్లు వ్యాపిస్తున్నాయి. కుక్కకోసం ప్రతి పొదా గాలిస్తూ వస్తున్నారు దానవయ్యలు. "అన్నయ్యా! నువ్వు అటునుంచిరా; నేను ఇటువేపు నుంచి వస్తాను!" అన్నాడు చినదానవయ్య. కల్లుకైపుతో వారి కళ్ళు మత్తెక్కాయి. తామున్న పరిసరాలుకూడా తెలియలేదు వారికి. వారి లక్ష్యం కుక్కను హతమార్చడమే!

"ఇదిగో తమ్ముడూ! ఇక్కడుంది! త్వరగా రా! జాగ్రత్త! కాసుకో!" అంటూ, ఉన్నట్టుండి పొలికేక పెట్టాడు పెదదానవయ్య. ఇద్దరూ కలిసి రోకటి బండలతో కుక్కమీదికి లంఘించారు. కేవలం అది కుక్కే అయినా, అది ప్రాణాపాయస్థితి!...ప్రాణాలకు తెగించి శక్తినంతా కూడదీసుకుని అదివాళ్ళ మీదికి దూకింది. కుక్కమీద ఫెడేల్ ఫెడేల్మంటూ రెండు రోకటిపోట్లు పడ్డాయి ఐనా అది మహారౌద్రంతో వారి నెదిరించి పోరాడసాగింది. భెంగు భెంగున వాళ్ళ మీదికి గెంతింది. ముఖాలమీద కరచింది.

ఈ పెనుగులాటలో హఠాత్తుగా దానవయ్యలు వెనక్కు విరుచుకుపడిపోయారు! ... మరు క్షణం హృదయ విదారకమైన రెండు ఆర్తనాదాలు!... అవి-దానవయ్యలు తమకోసం తీసి ఉంచుకున్న రాళ్ళబావి! ... అందులో రాళ్ళ నడుమ రక్తంలో మునిగితేలుతున్న రెండు కళేబరాలు!... మృత్యువును ఓడించి, ఫకీరుకుక్క విజయగర్వంతో ఊళ్ళోకి నడిచింది.

* * *

ఒకటికి రెండు నరబలులు జరిగిపోయాయి. ఈ వ్యావహారిక దృక్పథంతోనే పెదదానవయ్య కొడుకు, చిన దానవయ్య కొడుకు కలిసి, ఆ బావిని మరికొంత త్రవ్వించారు. కాని, బండపూర్తి కాలేదు; గంగాభవాని కటాక్షించలేదు.

...తమ తండ్రుల ఊహ మేరకు నరబలి యిస్తే, గంగ కటాక్షించగలదు. ఒకటికాదు, రెండు బలులు ముగిసినా గంగ ప్రసన్నురాలు కాలేదంటే-దానవయ్యలు నరులు కానట్టేగా? వారు మానవులు కారనడానికి ఇంత కంటే దృష్టాంతం మరేం కావాలి?